క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ మేనేజింగ్ డైరెక్టర్ సూరేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రంపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వెంకంపేట, ఓల్డ్ బస్టాండ్, సంజీవయ్యనగర్, ఆటోనగర్, ఆసిఫ్‌పుర, అశోక్‌నగర్, అనంతనగర్, అంబికానగర్, కోర్టు ఏరియా, సర్దార్‌నగర్, శాంతినగర్, అంబేద్కర్‌నగర్, రాళ్లబావి, దోబీగల్లీ, రెడ్డివాడ, వెంకటేశ్వర టెంపుల్, గాంధీనగర్, మున్సిపల్ ఆఫీస్, విద్యానగర్, గీతానగర్, పోచమ్మ టెంపుల్, సుభాశ్ నగర్, చంద్రంపేట, రగుడులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా కల్యాణ వేడుకలు


కల్యాణ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కోనరావుపేట: మండలం బావుసాయిపేటలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు వైభవంగా జరిపించారు. ఆలయంలో మూడు రోజులుగా కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. శనివారం కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శేష హోమం, మహా పూర్ణాహుతి, కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ చంద్రయ్య, నాయకులు రాజేశంగౌడ్, శివతేజరావు, మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, మహిళా నాయకురాళ్లు సంధ్య, వినోద, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పాలనలో ఓ అభివృద్ధి, మరోవైపు సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలం అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.65కోట్లు మంజూరు చేసిందన్నారు. ఉపాధిహామీ కింద సీసీరోడ్లకు రూ.24 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వేములవాడ: పట్టణంలోని శామకుంటలో నూతనంగా నిర్మించిన విజిటబుల్ మార్కెట్లో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అర్హత కలిగిన వ్యాపారులు ఈనెల 26 నుంచి వచ్చేనెల 4వ వరకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధివ్యాపారం చేసుకునే లైసెన్స్ కలిగిఉండి, ఐడీకార్డు ఉండి, కూరగాయలు, పూలు, పండ్లు అమ్ముకునేవారు అర్హులన్నారు.

విరాళం అందజేత

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి మామిండ్ల శ్రీనివాస్ రూ.10,116లను విరాళంగా అందించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. తనవంతుగా శ్రీనివాస్ ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. మల్కపేటలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి పైడిపాల కనుకయ్య రూ. 5016, ఎరుకలి సంఘం సభ్యులు రూ. 3,600 విరాళంగా అందజేశారు.

గంభీరావుపేటకు చేరిన మోటార్ సైకిల్ యాత్ర

గంభీరావుపేట: వాహనాలను ఇష్టారీతిగా నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారంటూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు హైదరాబాద్‌కు చెందిన మెజీషియన్లు చేపట్టిన మోటార్‌సైకిల్‌యాత్ర శనివారం గంభీరావుపేటకు చేరింది. మెజీషియన్లు మారుతి జోషి, రామకృష్ణ కళ్లకు గంతలు కట్టుకొని మోటారుసైకిల్ యాత్ర చేపట్టారు. హైదరాబాద్‌లోని ముచ్చింతల్ నుంచి అయోధ్య వరకు మోటారు సైకిల్ యాత్ర కొనసాగుతుందని తెలిపారు.

28న రైతుల సంఘీభావ ర్యాలీ

ఎల్లారెడ్డిపేట: కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 28న హైదరాబాద్‌లో రైతుల సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాం కళాశాల చౌరస్తా నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ నాయకులు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

రైతులకు గిట్టుబాటు కల్పించాలి

సిరిసిల్లటౌన్: రైతుల పంటకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు దీక్షలు, నిరసనలకు మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై జిల్లావ్యాప్తంగా ఈనెల 26న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

బ్యూటీ'ఫుల్' ఉపాధి

- పెళ్లికూతురు గెటప్‌కు డిమాండ్
- ఫంక్షన్లు, ప్రత్యేక రోజుల్లో ప్రత్యేకం
- బ్యూటీషియన్స్‌కు పెరుగుతున్న ఆదరణ
- హెయిర్‌స్టైల్స్, సారీ డ్రాఫ్టింగ్, మెహందీ స్పెషల్

సండే స్పెషల్

పెళ్లి కూతురు మేకప్‌కు డిమాండ్ పెరిగింది. మారిన కాలానుగుణంగా పెళ్లి కూతుర్ని తయారు చేసేందుకు బ్యూటీషియన్ వృత్తిలో కొత్తగా హెయిర్ స్టైల్స్, సారీ డ్రాఫ్టింగ్, మెహందీ ఉమెన్స్ వచ్చారు. పెళ్లికూతుర్ని అందంగా తయారు చేయడంతో పాటు ఫంక్షన్ మొత్తంలో ప్రత్యేకంగా కనిపించేలా సౌందర్యాన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుత ట్రెండ్ కనుగుణంగా అలంకారంలో ఎన్నో మార్పులు చోటు చేసుకోగా కేవలం బ్యూటీషియన్స్‌గా రాణిస్తున్న మహిళలపై సండే స్పెషల్..

సిరిసిల్లటౌన్: అందంగా తయారు కావడానికి ప్రాధాన్యం ఇచ్చే మహిళలు బ్యూటీషియన్స్‌గా రాణిస్తున్నారు. బయటకు వెళ్లకుండానే ఇంట్లోనే ఫంక్షన్లకు ప్రత్యేక ప్యాకేజీలు మాట్లాడుకుంటూ నిరంతర ఉపాధి పొందుతున్నారు. సిరిసిల్లలోనే 400 మందికి పైగా యువతులు బ్యూటీషియన్ వృత్తిలో రాణిస్తూ ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా పెళ్లి కూతురు, సారీ ఫంక్షన్స్‌కు అమ్మాయిలు, చిన్నారులను అందానికి మరింత మెరుగులు దిద్దుతున్నారు. హైడ్రోస్, ఫేషియల్, క్లీనప్, వ్యాక్స్, మెనిక్యూర్, పెడిక్యూర్, సీటీఎం చేస్తున్నారు. చేతులకు, పాదాలకు మెహెందీ పెట్టడం, ఇవికాకుండా హెయిర్ స్టైల్ కనిపించడానికి యూ షేప్, వి షేప్, స్టేట్ కట్, ఫ్లేయర్ కట్, ఫెదర్ కట్, స్టెప్స్ కట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఫంక్షన్‌లో ప్రత్యేకంగా కనిపించేలా చీరకట్టులో పెళ్లికూతురు, హాఫ్ సారీస్ వెరైటీ డిజైన్స్‌గా కడుతున్నారు.



15 మందికి ఉపాధి



ఫంక్షన్‌లో అందరికన్నా పెళ్లి కూతురు హైలెట్‌గా కనిపించాలని కోరుకుంటున్నారు. పదిహేడేళ్లుగా పట్టణంలో బ్యూటీషియన్‌గా రాణిస్తున్నా. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే తీరిక ఉండదు. పదిహేను మంది వరకు ట్రైనీస్‌కు ఉపాధి అందిస్తున్నా. కొందరు బ్యూటీ పార్లర్‌కు వస్తుంటే చాలామంది ఫంక్షన్ మొత్తానికి ప్యాకేజీ ఇస్తున్నారు.హెర్బల్ మేకప్ మా ప్రత్యేకత. సీజన్‌లో నెలకు రూ. 50వేలు సంపాదిస్తాం.

– కుశిగుంపుల మహతి, బ్యూటీషియన్

ప్రత్యేక చీరకట్టు



నేను ఏడాదిగా సిరిసిల్లలో బ్యూటీపార్లర్‌లో సారీ డ్రాఫ్టర్‌గా పనిచేస్తున్నా. మొదట్నుంచే ఫ్యాషన్‌పై ఆసక్తి ఉంది. అందుకే సివిల్ డిప్లొమా అయిపోగానే ఖాళీగా ఉండకుండా బ్యూటీషియన్ కోర్సు నేర్చుకొని సారీ డ్రాఫ్టింగ్‌లో మెళకువలు సాధించా. పెళ్లి కూతురుకు రూ.500 మామూలు వాళ్లకు రూ.250 చార్జీ తీసుకుంటాం. కస్టమర్లు కోరిన రీతిలో చీరకడుతాం.

– బులుముల స్రవంతి, సారీ డ్రాఫ్టర్

పదేళ్లుగా ఉపాధి



కొత్తకొత్త డిజైన్స్‌లో మెహందీ పెట్టుకునేందుకు కస్టమర్లు ఇష్టపడుతున్నారు. పెళ్లిళ్లలో మెహందీ తప్పనిసరి. అయితే కూర్చుని పనిచేసినా చాలా కష్టమైన పని. గంటల తరబడిగా బొమ్మలా కదలకుండా కూర్చొని కస్టమర్లకు మెహందీతో డిజైన్స్ వేయాలి. పదేళ్లుగా సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్‌లో మెహందీ డిజైనింగ్‌తో ఉపాధి పొందుతున్నా. పెళ్లికూతురుకు రూ. 3వేలు, ఫ్యామిలీ ప్యాకేజీకి రూ.10 తీసుకుంటాం.

– ఎస్‌కే. నేహా, మెహందీ డిజైనర్

లేటెస్ట్ హెయిర్ స్టైల్స్



ఇటీవల జుట్టును అందంగా అలంకరించుకునేందుకు అన్నివర్గాల అతివలు ఇష్టపడుతున్నారు. చిన్నప్పటి నుంచి వెరైటీ డిజైన్స్‌లో జుట్టువేసుకోవడం ఇష్టం. ఇప్పుడు ఆన్‌లైన్‌లో చూస్తూ..కస్టమర్లు కోరినట్లుగా హెయిర్ డిజైన్స్ వేస్తాం. ఇప్పుడు పెళ్లికూతురుకు కొత్త మోడల్స్‌లో పూలజడ అడుగుతున్నారు. ఇతరులైతే బట్టర్‌ఫ్లై ఫ్రెంచ్ స్టైల్, శిఖ, పలు మోడల్స్‌ను కోరుతున్నారు. సీజన్లలో నెలకు రూ.10వేలు వరకు సంపాదిస్తాం.

– తస్నీమ్ అనీబా, హెయిర్ డిజైనర్

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం

ముస్తాబాద్: మండలంలోని బందనకల్‌లో శ్రీ వాసుదేవాశ్రమంలో శ్రీ రుక్మిణీ వేణుగోపాలస్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. చివరిరోజు శనివారం స్వామివారి కల్యాణాన్ని ప్రత్యేక మండపంలో జరిపించారు. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రుత్వికులు రేపాక రామశర్మ, రేపాక రాజేందర్‌శర్మ, అప్పాల రసరాజ శర్మ, నందశర్మ, శ్రీచరణ్ శర్మ, మునుగోటి కృష్ణకల్యాణ్ శర్మ, హరిప్రసాద్ శర్మ, నాయకులు వెంకట్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, రాజు, వెంకటస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

• అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

ముస్తాబాద్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ప్రత్యేకాధికారి సురేశ్ అన్నారు. మండలకేంద్రంలో ఇటీవల కొందరు నిబంధనలు అతిక్రమించి, భవనాలు నిర్మిస్తున్నారన్నారు. వెంటనే పనులను నిలిపివేశామన్నారు.

• బాధ్యతల స్వీకరణ

చందుర్తి: చందుర్తి ఎంపీడీవోగా శశికళ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన పత్తి రవీందర్ జగిత్యాల జిల్లా ధర్మపురి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నుంచి చందుర్తి ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు.

3న యాంటి డ్రగ్స్‌పై 5కే రన్

సిరిసిల్లక్రైం: గంజాయి, డ్రగ్స్‌తో జరిగే అనర్థాలను వివరించి, వాటి నియంత్రణపై అవగాహన కల్పించేందుకు మార్చి 3న 5కే రన్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ భీమాశర్మ తెలిపారు. శనివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రన్నింగ్‌లో పాల్గొనేందుకు ముందుగా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. సిరిసిల్లటౌన్, రూరల్ సీఐలు రఘుపతి, సదన్‌కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

• నేడు క్రికెట్ పోటీలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో దివంగత చీటీ వాసుదేవరావు స్మారక ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ చివరిపోటీలు ఆదివారం ఏర్పాటు చేసినట్లు జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

• దుండగులను శిక్షించాలి

గంభీరావుపేట: జర్నలిస్టు శంకర్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

• ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో పార్క్‌చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గుండం యాదగిరి తన ద్విచక్రవాహనాన్ని ఓ ఐరన్‌స్టోర్ ముందు పార్క్‌చేశాడు. సాయంత్రం చూసేసరికి వాహనం కనిపించలేదు. మిత్రులను వాకబుచేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

• ఆటో డ్రైవర్‌పై దాడి

సిరిసిల్లక్రైం: ఆటో అడ్డా వద్ద డ్రైవర్ల మధ్య గొడవ జరుగుతుండగా ఆపేందుకు ప్రయత్నించిన మరో డ్రైవర్‌పై దాడిచేశారు. పోలీసుల వివరాల ప్రకారం .. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన తాజొద్దీన్ ఆటో నడుపుతున్నాడు. రోజు మాదిరిగా కొత్త బస్టాండ్ ఏరియాలోని ఆటో అడ్డాకు వచ్చాడు. అక్కడున్న తోట వినయ్, బాబు అనే ఆటోడ్రైవర్లు గొడవ పడుతున్నారు. ఇద్దరిని వారించేందుకు యత్నించగా కోపోద్రిక్తుడైన వినయ్, తాజొద్దీన్‌పై కర్రతో దాడిచేశాడు. తాజొద్దీన్ తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వినయ్‌పై కేసు నమోదుచేసినట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

• వృద్ధుడు మృతి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని తర్లాసిపల్లి వ్యవసాయ పొలాల సమీపంలో బొడ్డు మైసయ్య (70) మృతిచెందాడు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌కు చెందిన మైసయ్య సిరిసిల్లకు వచ్చాడు. శనివారం సాయంత్రం తుర్లాసిపల్లి వ్యవసాయ పొలం వద్ద వృద్ధుని మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఎస్సై మల్లేశం చేరుకొని వివరాలు సేకరించారు. తిప్పాపూర్‌కు చెందిన మైసయ్యగా గుర్తించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. కేసునమోదు చేసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని సీఐ పేర్కొన్నారు.

• విజయవంతం చేయాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప బస్సు యాత్ర జిల్లాలో మార్చి 2న ప్రారంభమవుతుందని, బీజేపీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్ కోరారు. మండల బీజేపీ బూత్‌స్థాయి అధ్యక్షులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు గంట అశోక్, ప్రధాన కార్యదర్శి దోమకొండ కృష్ణకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: విజయ సంకల్ప బస్ యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గజభీంకార్ చందు, మహేందర్, శ్రీనివాస్‌రావు, సంజీవ్, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోనరావుపేట: కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన లవన్ రాష్ట్రస్థాయి క్రికెట్‌పోటీలకు ఎంపికైనట్లు రాజన్న సిరిసిల్ల సెక్రెటరీ ప్రభాకర్ తెలిపారు. ఈనెల 26 నుంచి 29వరకు జడ్చర్ల (మహబూబ్‌నగర్ జిల్లా)లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. లవన్‌ను ప్రధానోపాధ్యాయుడు వినోద్, పీఈటీ అజయ్‌కుమార్ అభినందించారు.

హైలెవల్ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు కొండూరు గాంధీబాబు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణం, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 9వ ప్యాకేజీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని గాంధీబాబు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

రైతులకు అవగాహన



కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో జిల్లా ఏరువాక కేంద్రం (కరీంనగర్) ఆధ్వర్యంలో అఖిలభారత సకశేరుక చీడల యాజమాన్య సంస్థ (హైద్రాబాద్) సహకారంతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ అరుణ శ్రీ కోతులు, అడవిపందుల సమస్యకు జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు అభివృద్ధి చేసిన అగ్రికానన్, ఈ కానన్, అగ్రిసోలార్ పరికరాల పనితీరును డెమో ద్వారా రైతులకు వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతులు పండిస్తున్న పంట ఉత్పత్తులను ఈనామ్ ద్వారా ఎలా విక్రయించాలి, ఈనామ్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు సమాఖ్య చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, రావెప్ విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం


గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో భక్తాంజనేయస్వామి విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు యాగశాల ప్రవేశంలో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు గోపూజ చేశారు. గ్రామంలో ప్రతిష్ఠ దేవతా విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు సంకెపల్లి చంద్రమౌళి శర్మ, రత్నాకర్ శర్మ, వెంకన్న శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ భక్తబృందం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గోవిందరాజుల కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు


పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి (వేములవాడ) : మండలంలోని సనుగులలో శ్రీ గోవిందరాజుల స్వామివారి కల్యాణాన్ని శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి, స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. లింగంపేట, మల్యాల, కట్టలింగంపేట, కిష్టంపేట, జోగాపూర్, మర్రిగడ్డ, చందుర్తి, బండపల్లి, రామరావుపల్లె గ్రామాలకు చెందిన కోనరావుపేట మండలం వట్టిమల్ల, బావుసాయిపేట, నిమ్మపల్లి గ్రామాల భక్తులతో పాటు వేములవాడ, కరీంనగర్, హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, జిల్లా కార్యదర్శి గొట్టె ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పూజలు

మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి దంపతులు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లోక బాపురెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్‌లు, మాజీ సర్పంచులు స్వామివారిని దర్శించుకున్నారు.

రుద్రంగిలో ప్రత్యేక పూజలు

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రంలోని శ్రీ గండి వేంకటేశ్వరుడి కల్యాణం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పోతారం, కలికోట, తాంండ్ర్యాల, గోవింద రాజుల గట్టుపై దేవతా మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, డీసీసీ కార్యదర్శులు తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, లింగం, నాయకులు గంగనర్సయ్య, నారాయణ, గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


రాములు (ఫైల్)

వీర్నపల్లి: గర్జనపల్లికి చెందిన న్యాత పెద్దరాములు(58) శనివారం పశువులకు నీళ్లు పెట్టడానికి బావి వద్దకు వెళ్లగా విద్యుత్‌షాక్ తగిలి బావిలో జా రిపడి మృతి చెందాడు. పోలీ సులు తెలిపిన వివరాలు. న్యాత పె ద్దరాములు పశువులకు నీళ్లు పెట్టడానికి గుజ్జరి భా స్కర్ బావి వద్దకు వెళ్లాడు. స్టార్టర్ వద్ద ఉన్న కరెంట్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో ప క్కనే ఉన్న బావిలో జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై రమేశ్ పరి శీ లించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని గడ్డం బాలరాజు స్మారకర్థం క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు 8 టీమ్‌లు హా జరయ్యాయి. శ్రీనివాస్, రాజు, కృష్ణ, ఎల్లయ్య, రూపేందర్, విజయ్, తదితరులు ఉన్నారు.

తండాల అభివృద్ధే లక్ష్యం


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మారుమూల గిరిజన తండాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా గ్రామ పంచాయతీల్లో రూ.11లక్షల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మిగిలిన పనులకు ప్రతిపాదనలు అందించాలన్నారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు కృష్ణమూర్తి శర్మ,గౌస్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రెడ్డి, తిరుపతి, మల్లేశం, రాజునాయక్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని మొదటి బైపాస్‌రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గా యపడ్డారు. మండల కేంద్రానికి చెందిన కంది శ్రీనివాస్‌రెడ్డి మొదటి బైపాస్ గల్లీ నుంచి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. గాయపడ్డ శ్రీనివాస్‌రెడ్డిని స్థాని కులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎడమకాలు విరిగినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి పరారయ్యాడు. జరిగిన సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కాంగ్రెస్‌లో చేరిక

కోనరావుపేట: మండలకేంద్రానికి చెందిన సుమారు 30 మంది మహిళలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యదర్శులు చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించా రు. గ్రామశాఖ అధ్యక్షుడు మాందాల లింబ య్య, సీనియర్ నాయకులు గొట్టె శంకర్, పాత్కాల ప్రకాశ్, తైదల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్సంగం

సిరిసిల్లకల్చరల్: బీవైనగర్‌లోని హనుమాన్ మందిరంలో శనివారం సత్సంగం నిర్వహించారు. 80 మంది భక్తులు గీతా పారాయణం, లక్ష్మీఅష్టోత్తర నామ పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు.

పలుచోట్ల భారీ వర్షం

- ఈదురుగాలులతో నిలిచిన విద్యుత్ సరఫరా

వేములవాడ/ఎల్లారెడ్డిపేట: వేములవాడతో పాటు ఎల్లారెడ్డిపేట మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు.. మెరుపులతో వర్షం పడటంతో సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఎల్లారెడ్డిపేటలో రెండు గంటల పాటు అంధకారం నెలకొంది. సాయంత్రం వరకు ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ హఠాత్తుగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో మండలంలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపడి కరెంటు సరఫరా నిలిచిపోయింది.